# లంక మేత - గోదావరి ఈత

శ్రీ పాలడుగు వెంకటేశ్వరరావు

జీవితంలో దుర్భరమైన దుఃఖాన్ని చూసిన సుబ్బారావు ఒక అతి సామాన్యమైన మనిషి. ఒకరోజు సుబ్బారావుకి బ్రతుకుమీద విరక్తి పుట్టింది. ఈ జీవితం ఒక భయంకరమయిన ముళ్ళపొద, అన్పించింది. పెళ్ళాం, పిల్లలూ, బంధువర్గమూ - అతని మెతక తనాన్ని ఆసరా చేసుకుని అకారణంగానే, అతనిమీద దౌష్ట్యం, దౌర్జన్యం చెలాయించేరు. సర్వప్రపంచంమీదా, అతనికి గొప్ప అసహ్యం కలిగింది. అతనిలో నానాటికీ పెరుగుతూ వున్న జడత్వం మీద, చుట్టూరా వుండివున్నవారి హింసాకాండ పెచ్చుమీరింది, కారణా కారణాలు కానక అది వెర్రితలలూ శిలలూ వేసి అతనికి బాధాకరంగా తయారయింది. అతను తట్టుకోలేకపోయాడు. ఆ బాధని ఇక భరించలేక ఒకరోజు తెల్లవారుఝామున కట్టుబట్టలతో, వున్న పాటున, సుబ్బారావు, ఇల్లూ వాకిలీ వదిలిపెట్టి, విశాల ప్రపంచంలోకి, కట్లు త్రెంచుకున్న దున్నపోతులాగా, పారిపోయాడు, తిరిగి వెనక్కి చూడకుండా. పారిపోయి-నర సంచారానికి దూరంగా వెళ్ళిపోయాడు. 'అమ్మయ్య' - అని ఊపిరి పీల్చుకున్నాడు.

వంకలు, చెట్లు, చేమలు, అడవులు, కొండలు, గుట్టలు, రాళ్ళు, రప్పలవెంట చాలా రోజులు పిచ్చి పిచ్చిగా తిరిగాడు. ఆకలి వేస్తే, అందిన కాయా కసురూ కోసుకుని తిన్నాడు. అదీ దొరకనప్పుడు ఆకూ అలమూ తెంపుకుని తిన్నాడు. దాహం అనిపిస్తే వాగుల్లో, వంకల్లో దోసిళ్ళతో నీళ్ళు అందుకుని తాగాడు. చెట్టుక్రిందో, మీదో, పుట్టమీదో, కొండ బిలంలోనో నిద్రపోయాడు. రెండు కాళ్ళ జంతువులాగా బ్రతికాడు. అతని కట్టుబట్టలు నల్లగా అయి, చిరిగి పేలికలయిపోయాయి. చివరికి కౌపీనమే ఆ వంటిపైన మిగిలింది. జుట్టు నిరంకుశంగా పెరిగి దుమ్ము గొట్టుకుని జడలు గట్టింది. మకిలీ మడ్డి పట్టిన గడ్డమూ, మీసాలూ దుబ్బుగా మారాయి. అడవి మనిషిలాగా గమ్యమూ దారీ లేని తిరుగుడు - ఒకటే తిరుగుడు. పిచ్చి పట్టినట్లు తిరుగుడు. ఏమిటి ఈ తిరుగుడు? ఎందుకు? దేనిగురించి? అతనికే తెలియదు. ఎన్నాళ్ళో-అలాగ నిరంకుశుడై తిరగ్గా, తిరగ్గా-

ఒక దుర్ముహూర్తాన సుబ్బారావులో అకస్మాత్తుగా భయంకరమయిన స్తబ్ధత చోటు చేసుకుంది. ఆ స్తబ్ధత నిరాసక్తికీ, అది విరక్తికీ చోటు ఇచ్చింది. భూమీ, నీరూ, ఆకాశమూ, సమస్తమయిన ప్రకృతీ - వెగటుగా అన్పించింది. ప్రపంచమే రోతగా అన్పించింది. తక్షణం ఒక నిర్ణయానికి వచ్చాడు, సుబ్బారావు.

వెంటనే, ఆత్మహత్యకి తలపడి నదిలోకి దూకాడు...సుళ్ళు తిరుగుతూ ఉరకలు వేస్తున్న నదీ ప్రవాహంలో మునిగి కొట్టుకుని పోతూ ఇక తన పని అయిపోయిందనుకున్నాడు. చివరిసారిగా భగవంతుని స్మరించాడు. అంతే!

సుబ్బారావు శరీరాన్ని నెత్తిమీది జుట్టు పట్టుకుని లాక్కుని వచ్చి, ఒడ్డుమీద పెట్టి, ఉబ్బిన డొక్కల్ని నొక్కి, కడుపులోని నీరు, బయటికి తెప్పించాడు, ఆ వ్యక్తి. నోట్లో తన నోరుపెట్టి గాలి ఊది ఆగిపోబోతున్న సుబ్బారావు శ్వాసని, తిరిగి తెప్పించాడు.

చాలాసేపయినాక- ఎన్నో క్షణాలు గడిచినాక-

సుబ్బారావు కళ్ళు తెరిచి నీరసంగా చూశాడు, చివరికి! ఎదుట నిల్చివున్న ఆ వ్యక్తి ఆజానుబాహువు. స్ఫురద్రూపం, బంగారు ఛాయ గల మేను. కళ్ళల్లో చిరునవ్వులు, కాషాయాంబరాలు, జటావల్కలధారి! మధుర మందహాసం చేసి - "ఇంత పని ఎందుకు చేసావు నాయనా?' అని ఆ వ్యక్తి ప్రశ్నించాడు.

'చచ్చిపోదామని' అన్నాడు సుబ్బారావు, విరక్తిగా, నీరసంగా.

'నీవు చచ్చి ఏం సాధిస్తావు?! ఆత్మహత్య మహాపాపం, నాయనా?'

'స్వామీ! పాపం అంటే ఏమిటి? నన్ను నేను చంపుకోవటం పాపమెలా అవుతుంది?' అన్నాడు, సుబ్బారావు అమాయకంగా, సూటిగా.

'బాబూ! నీకు అన్నీ వివరంగా చెపుతాను. నా వెంటరా." అని సుబ్బారావుని తనవెంట తీసుకువెళ్ళాడు ఆ వ్యక్తి, ఆసరా ఇచ్చి నడిపించి. ఆ కొండల్లో కోనల్లో అక్కడికి దగ్గరలోనే చిన్న కుటీరం వుంది. అదే అతని ఆవాసం. అక్కడ అతను ముక్కు మూసుకుని తపస్సు చేసుకుంటాడు. అక్కడికి 'అంత' దూరంలో ఒక దేవాలయం

వుంది. దేవుడ్ని దర్శించటానికి వచ్చిన భక్తులు ఈ స్వామిని కూడా దర్శించి, పండో ఫలమో సమర్పించి, దండం పెట్టుకుని తృప్తిపడి వెళ్ళిపోతుంటారు. అదే ఆతని ఆహారం. లేనినాడు, నిరాహారం. స్వామి పేరు రమానంద. పూర్వాశ్రమంలో రమానంద అక్కడికి దగ్గరలో వున్న ఒక పట్టణంలో పెద్ద వ్యాపారి. కోట్లు గడించి, భార్యా పిల్లలకి అప్పగించాడు. ఒకరోజు హఠాత్తుగా 'జ్ఞానోదయం' అయింది. అన్నిటినీ వదిలి సన్యాసిగా విరాగిగా మారిపోయి, ఇక్కడికి వచ్చివుంటున్నాడు. అది జరిగి అయిదేళ్ళయింది - తన గురించి చెప్పి - "నేను సన్యాసిని. అన్నిటినీ విసర్జించాను. ముక్కు మూసుకుని తపస్సు చేసుకుంటూ భగవదారాధనలో ప్రశాంతంగా కాలం గడుపుతున్నాను'- అన్నాడు రమానంద సుబ్బారావుతో.

"స్వామీ! మీ ధ్యేయం ఏమిటి?' అడిగాడు సుబ్బారావు.

'నా ధ్యేయం భగవంతుణ్ణి తెలుసుకోవటమే" అన్నాడు రమానంద నవ్వి.

'స్వామీ! అందుకు దారి ఏది? భగవంతుడ్ని చూసి తరించే దారి ఉందా?"

'దారి ఉందిలే! ముందు, నన్ను నేను తెలుసుకోవాలి - అది తెలుసుకొనటానికి అరిషడ్వర్గాలనీ జయించటం ముఖ్యం. నేను వాటిని జయించాను.' అన్నాడు రమానంద గర్వంగా.

'అరిషడ్వర్గాలంటే ఏమిటి?'- అడిగాడు సుబ్బారావు భక్తితో.

'ఈ మనిషిలో వున్న కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలే అరిషడ్వర్గాలు. ఇవి మనిషికి పరమ శత్రువులు. ఇవి నిరంతరం జీవుడిమీద దాడి జరుపుతూ ఆతని పతనానికి కారణభూతాలవుతున్నాయి. వీటిని జయించిననాడు, మానవుడు తననితాను తెలుసుకుంటాడు; మనిషికి అవసరమయిన ఆ ఉత్తమోత్తమమయిన మార్గాన్ని గుర్తించగల్గుతాడు. అటువంటి ఆ మార్గాన పయనించి చిదానందాన్ని అందుకుని, ఆ భగవంతునిలో, చివరకు, ఐక్యమయిపోతాడు. అదే మోక్షం.' - ప్రశాంతంగా చిరునవ్వులు వెదజల్లుతూ, వివరించాడు రమానంద. బుర్ర విదిలించాడు సుబ్బారావు. సుబ్బారావుని ఆ మాటలు ఆకర్షించాయ్. ఆ మాటలమీద అతనికి విశ్వాసం ఏర్పడింది. గురి కుదిరింది. నమ్మాడు.

'స్వామీ! నన్ను మీతో ఆ మార్గాన తీసుకుని వెళ్ళగలరా?' అని ప్రాధేయపూర్వకంగా అడిగాడు, సుబ్బారావు.

'నాయనా! తప్పకుండా. కానీ, దానికి కఠోర సాధన కావాలి. దీక్ష వుండాలి' అనగా - 'నేను సిద్ధం! మీరు నన్ను మీ శిష్యునిగా స్వీకరించగలరా? స్వామీ!' అని అర్థించాడు సుబ్బారావు. 'అలాగే' అని ఆశీర్వదించాడు రమానంద, సాదరంగా.

సుబ్బారావు పరమానందం చెందాడు. అప్పట్నుంచీ రమానందకి శిష్యునిగా మారిపోయాడు.

గురుర్బ్రహ్మ, గురుర్విష్ణుః
గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్పరబ్రహ్మ
తస్మైశ్రీ గురవేనమః- అని రమానందకి నమస్కరించాడు. ఆ క్షణంనుండి సుబ్బారావు ఏకాగ్రతతో, భక్తి, శ్రద్ధలతో రమానందను సేవించటం ప్రారంభించాడు. రాత్రింబవళ్ళు గురుసేవలో మునిగిపోయాడు. అదే అతని జీవితధ్యేయమయింది. గురువుగారి ఆజ్ఞలను శిరసావహించాడు. గురువు నోటివెంట వచ్చే ప్రతి మాటనూ వేదవాక్కుగా పరిగణించాడు. తనను ముక్తిమార్గంవెంట చేయి పట్టుకుని నడిపించి తీసుకునివెళ్ళే అవతారమూర్తిగా అతన్ని ఆరాధించాడు. ఆ లక్ష్యాన్నే ధ్యేయంగా పెట్టుకుని సకల పరిచర్యలనూ గురువుకి అందించటంలో మునిగిపోయాడు. ఇతరమయిన అన్ని విషయాలనూ విస్మరించాడు, సుబ్బారావు. గురువే సర్వస్వం అనుకున్నాడు.

కాలం నడిచింది. నెలలు గడిచేయ్. సంవత్సరాలు గిర్రున తిరిగాయ్. లెక్క ప్రకారం వర్షాకాలం వచ్చింది. చల్లని గాలులు, పరుగెడుతూ వచ్చినయ్. భయంకరమయిన కారు మొయిళ్ళు ఆకాశాన్ని ఆక్రమించి, కడవలతో ద్రిమ్మరించినట్లు ప్రపంచాన్ని కుంభవర్షాలతో ముంచెత్తాయ్. వాగులు వంకలు పొంగి పరవళ్ళెత్తేయ్. ఆ కారణంగా. దేవాలయానికీ, స్వామి దర్శనానికీ వచ్చే భక్తుల రాకపోకలు ఆగిపోయాయ్. తద్వారా అందే పండూ, ఫలమూ అందకుండా పోయింది. అలా-

ఒకరోజు అయింది - కడుపులో పేగులు గుడగుడమన్నయ్.

రెండవరోజు గడిచింది - నీరసం, నిస్సత్తువా ఆవహించాయ్.

వారం రోజులు నడిచి వెళ్ళిపోయేయ్. పరిస్థితిలో మార్పు లేదు. ఆకలి! ఘోర కలి! అరిషడ్వర్గాలనూ జయించానన్న రమానంద తపస్సు భంగపడింది. చిడిముడిపాటు, స్వామిని ఆవహించింది. కోపతాపాలు వచ్చి పడినయ్.

'ఈ రీతిన' తమ 'తపస్సు భంగపడటానికి కారణం ఏమిటి స్వామీ!' - సుబ్బారావు వినయంగా అడిగాడు రమానందని ఒక రోజున.

'నరాలలో నీరసం నాయనా! ఆకలి మండిపోతూ వుంది' అన్నాడు రమానంద, దీనంగా, జాలి గొలిపేలాగా.

'అయితే - నావలే, తమరూ ఆకూ అలమూ స్వీకరించండి స్వామీ!'

'నాయనా! నీవు జడుడవు. అందువలన నీకల్లన అవవచ్చు నేమోగానీ ఆ పని మావలన కాదు నాయనా?' అన్నాడు రమానంద చప్పరిస్తూ, లాలాజలం మింగుతూ.

'ప్చ్! అందుకు కారణం ఏమిటి స్వామీ!' జిజ్ఞాసతో అడిగాడు సుబ్బారావు.

'అ రుచీ పచీ లేని ఆకులలములు మా వంటికి పడవు, బాబూ'

'అసలు ఒక సన్యాసికి రుచులతో పని ఏమిటి, మహాత్మా?!'

'అది నీకు తెలియదు; మూర్ఖుడవు గదా?'

'చిత్తం! అందుకే నాకు తెలిసేటట్టుగ చెప్పమని మనవి చేసు కుంటున్నాను, మహర్షీ'

'అది తర్వాత చెపుతాను. నీవు తక్షణం నోరు మూసుకుని నేను చెప్పినట్లు చెయ్యి. చుట్టుప్రక్కలనున్న ఏ ఊరికో పోయి, ఇంత ఆహారం సంపాదించుకునిరా, త్వరగా.'

'నాల్గువయిపులా అన్ని వాగులూ వంకలూ పొంగిపొరలు తున్నాయ్, దారి లేదు స్వామీ'

'ఎలాగో దారి చేసుకుని వెళ్ళిరా. ప్రయత్నించు. అది ముఖ్యం.'

'మహాత్మా! నేను అలా చేస్తే చచ్చిపోతాను! అంత భయంకరంగా వున్నాయ్ వరదలు!!'

'ఐతే అలాగే కానీ. నీవు చస్తే చచ్చావు. గురు సేవలో తరించిన పుణ్యం నీకు తక్షణం లభిస్తుంది. పుణ్యలోకాలకు పోతావు. వెంటనే వెళ్ళిరా. తినటానికి ఇంత అన్నం సంపాదించుకునివచ్చి, నా ఆకల్ని చల్లార్చి పుణ్యం కట్టుకో. అది నీ తక్షణ కర్తవ్యం.'

'నేను వెళ్ళను స్వామీ! ప్రాణభయం పట్టుకుంది'.

విపరీతమయిన అసహనంతో - 'మూర్ఖుడా!' అని అరిచి, సుబ్బారావు చెంపని ఛళ్ళుమనిపించాడు, రమానంద; గూబ గుయ్యి మంది; కళ్ళవెంట నీరు తిరిగింది సుబ్బారావుకి.

'ఫో!' - అరిచాడు రమానంద, అసహనంతో కోపంగా.

'అలాగే పోతున్నాను స్వామీ' అన్నాడు సుబ్బారావు దీనంగా.

'మరి త్వరగా వెళ్ళిరా.' వేగిరపెట్టాడు రమానంద.

'స్వామీ! వెళ్తానుగానీ, మళ్ళీ రాను. నీవు సన్యాసివి కావు. ఇన్నాళ్ళూ ఇలా నీ దగ్గర నేను వుండటం వృథా! సర్వం వ్యర్థం!! నీవు ఆకలికి ఆగలేవు. ఆ కోపాన్ని అసలే అరికట్టలేవు. మరి ఇంక నీవు సాధించిందేమిటీ?! నీ బొంద! నీవు దొంగ సన్యాసివి. అటువంటి నిన్ను నమ్ముకుంటే, కుక్క తోకని పట్టుకుని గోదావరిని ఈదినట్లే. ఈ క్షణంనుండి అసలు మనిద్దరికీ ఏం సంబంధం లేదు. నా దార్ని నేను పోతున్నాను. శలవు.' అని - ఆ కుంభవర్షంలో బయటికి వెళ్ళిపోతున్న, సుబ్బారావువంక నిశ్చేష్టుడై పిచ్చిగా చూస్తుండి పోయాడు రమానంద — నోరు పడిపోయినట్లు — మాట పెగిలి రాలేదు.

# దేవుడా...

## శ్రీ పి. వెంకటేశ్వర్

ఎక్కడ జారులను
జనులంతా పూజిస్తారో,
ఎక్కడ ధనం కోసం - పిల్లలు
తల్లితండ్రుల్నే త్యజిస్తారో,
ఎక్కడ నిర్దోషుల్ని
నిర్దయగా వురి తీసేస్తారో,
ఎక్కడ వ్యభిచారాన్ని
ఆచారంగా చేసేస్తారో,
ఎక్కడ నీతీ, న్యాయం
సమాధి చెయ్యబడ్డాయో,
ఎక్కడ ధర్మం, సత్యం
కాళ్ళిరిగి కూలబడ్డాయో,
అక్కడ....
అక్కడ....ఆ మనుషులమధ్య
నన్నెందుకు పుట్టించావ్?
అమ్మ కడుపులో వున్నప్పుడు
ఆత్మహత్య చేసుకోకపోవడమే
నేను చేసిన నేరమా తండ్రీ?